క్లుప్తంగా

పేదలకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న సొసైటీ నిర్వాహకులు

దొనకొండ: మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల, స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో వృద్ధులు, వికలాంగులకు సోమవారం పండ్లు పంపిణీ చేశారు. ప్రభు చారిటబుల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సుమారు 50 మందికి పండ్లు పంపిణీ చేశారు. ఆదిమూలపు ప్రభుదాసు, కె.ఐజిక్ డయస్, ఎగ్గోని గురవయ్య, ఎగ్గోని రవికుమార్, డానియేల్ పాల్గొన్నారు.

రేపు ఎస్‌కేఓఆర్ కళాశాలలో మెగా జాబ్‌మేళా

బేస్తవారిపేట: స్థానిక కందుల ఓబులరెడ్డి డిగ్రీ కళాశాలలో ఈ నెల 28వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కందుల ఓబులరెడ్డి తెలిపారు. అమెజాన్, బ్లూస్టార్, టెక్ మహేంద్ర, పేమెంట్ బ్యాంక్, యాక్సిక్ బ్యాంక్, ఫ్లిప్‌కార్ట్, డీమార్ట్, బిగ్‌బాస్కెట్, ఇన్‌స్టా కార్ట్, హంటర్ డౌగ్లాస్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుకున్న యువతీ, యువకులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

బేస్తవారిపేట: స్థానిక బస్టాండ్ ఆవరణలో జాతీయ రహదారిపై స్కూటీ అదుపుతప్పి బోల్తా పడటంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. బేస్తవారిపేటలోని రాణిపేటకు చెందిన షేక్ సుభానీ స్కూటీపై కంభం నుంచి బేస్తవారిపేటకు వెళ్తున్న సమయంలో అదుపుతప్పి కిందపడ్డాడు. సర్వీస్ రోడ్డుకు వేసిన ఇనుప గ్రిల్‌కు సుభానీ తల తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు 108లో తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు.



ప్రాణదాతలపై దాడులు దారుణం

ఆపదలో ఉన్న వారికి ప్రాణాలు పోసే వైద్యులపై దాడులకు పాల్పడటాన్ని తీవ్ర నేరంగా పరిగణించాలి. ముఖ్యంగా మహిళా వైద్యులపై దాడులకు పాల్పడటం దారుణం. వైద్యులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. ఇటీవల కోల్‌కతా వైద్యురాలి హత్య వైద్య వర్గాల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి చర్యలతో వైద్యులు తమ వృత్తికి సరైన న్యాయం చేయలేరు. ఆడపిల్లలు వైద్య వృత్తిలోకి రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఇది మంచి పరిణామం కాదు. ఇలాంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలి.

– శంకర్‌నాయక్, వైద్యాధికారి, ముటుకుల, పుల్లలచెరువు మండలం





మెరుగైన వసతులు కల్పించాలి

ఆస్పత్రుల్లో వందలాది మంది స్టాఫ్ నర్సులు, మహిళా వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పనిచేస్తున్నారు. పనిచేసే ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు స్టాఫ్ నర్సులకు, మహిళా వైద్యులకు భద్రత ఏర్పాటు చేయాలి. వైద్యులపై, సిబ్బందిపై దాడులు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలోని ఆర్.జి.కార్ వైద్యశాలలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి.

– కీర్తన జ్యోతి, స్టాఫ్ నర్స్, మార్కాపురం

సమస్యల వలయంలో ఆర్టీసీ బస్టాండ్

- ప్రయాణికులకు మంచినీళ్లూ కరువే
- పట్టించుకోని అధికారులు, పాలకులు

పుల్లలచెరువు: పేరుకే పుల్లలచెరువు ఆర్టీసీ బస్టాండ్. అన్నీ సమస్యలే. బస్టాండ్‌ను నిర్మించి సంవత్సరాలు కావస్తున్నా ప్రయాణికులకు తగిన వసతులను కల్పించడంలో ఆర్టీసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని చెప్పవచ్చు. పుల్లలచెరువు బస్టాండ్‌కు నిత్యం వివిధ డిపోల నుంచి పదుల సంఖ్యలో బస్సులు వచ్చి వెళ్తుంటాయి. అందులో భాగంగా వందల సంఖ్యలో మహిళలు, పురుషులు, చిన్నారులు, వృద్ధులు ఎంతో మంది బస్టాండ్ నుంచే ప్రయాణం చేస్తుంటారు. ప్రయాణికులకు, సిబ్బందికి కనీసం మంచినీరు కూడా బస్టాండ్ ఆవరణలో లేవు. టాయ్‌లెట్స్, మంచినీటి బోరు ఉన్నా అవి పనిచేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మంచినీటి కోసం బయట ఉన్న హోటళ్లకు ప్రయాణికులు వెళ్తుంటే వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ ఆవరణలో మంచినీరు, టాయిలెట్స్ లేవు. బస్టాండ్ ఆవరణలో నిత్యం దుమ్ముధూళితో దర్శనం ఇస్తోంది. ప్రయాణికులు కూర్చొనేందుకు సరైన బల్లలు కూడా లేవు. రోజూ బస్టాండ్‌లో రాత్రి వేళ మార్కాపురం డిపోకు చెందిన 2 బస్సులు ఉంటాయి. ఆ బస్సుల్లో విధులు నిర్వహించే సిబ్బంది భోజనం చేయాలన్నా నీటి కోసం బయటకు వెళ్లాల్సి వస్తోంది.

మహిళా సిబ్బందికి ఇబ్బందులే

ఆర్టీసీలో విధులు నిర్వహించే మహిళా సిబ్బందికి పుల్లలచెరువు రూట్‌లో డ్యూటీ వస్తే ఇబ్బందులు తప్పవు. విధులు నిర్వహించే సిబ్బంది ఆరుబయటకు వెళ్లాలన్నా మరుగుదొడ్లు లేక పోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు. డిపో అధికారులు ప్రజా సదస్సులు నిర్వహించే సమయంలో ప్రయాణికులు సమస్యలు అడిగితే దాతలు ఉంటే చెప్పండి బాగు చేయించి వారి పేరు వేస్తాం.. అని చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. బస్టాండ్‌లో కనీస మౌలిక వసతులు కల్పించక పోవడంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ ఆవరణ దుర్గంధం వెదజల్లుతూ ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. అధికారులు స్పందించి బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పుల్లలచెరువు బస్టాండ్



పనికి రాకుండా ఉన్న మరుగుదొడ్లు

మౌలిక వసుతులు కల్పించాలి



పుల్లలచెరువు బస్టాండ్‌లో కనీస వసుతులు ఏర్పాటు చేయాల్సిన ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడం దారుణం. ఇక్కడి ప్రయాణికులు, సిబ్బందికి కనీస వసుతులు లేక పోతే ఎలా. మంచినీరు, కూర్చోవడానికి బల్లలు, మరుగుదొడ్లు వంటి వసతులు ఏర్పాటు చేయాలి. అధికారులు బస్టాండ్‌ను సందర్శించి ఇక్కడ కావాల్సిన వసతులు ఏర్పాటు చేయాలి.

– జి.గురునాథం, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి, పుల్లలచెరువు

హోమియో వైద్యుడు లేక అవస్థలు

దొనకొండ: దొనకొండకు 2009–10లో హోమియో వైద్యశాల మంజూరైంది. అప్పట్లో రూ.5 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసి వైద్యశాల నిర్మించారు. బూచేపల్లి శివప్రసాదరెడ్డి 2010లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో హోమియో వైద్యుడిని నియమించారు. 2012–13లో అనివార్య కారణాలతో వైద్య ఉన్నతాధికారులు హోమియో వైద్యుడిని విధుల నుంచి తొలగించారు. నాటి నుండి నేటి వరకు వైద్యుడిని నియమించక పోవడంతో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హోమియో వైద్యశాల మాత్రం నేడు నిరుపయోగంగా మారింది. దొనకొండ, కురిచేడు, దర్శి, కొనకనమిట్ల మండలాల నుంచి ఎక్కువ మంది ప్రజలు హోమియో వైద్యం పొందేవారు. అప్పట్లో రోజుకు సుమారు 90–100 ఓపీ వచ్చేది. అందుబాటులో వైద్యుడు లేక పోవటంతో రోగులు యర్రగొండపాలెం, నరసరావుపేట, గుంటూరు తదితర ప్రాంతాలకు హోమియో వైద్యం కోసం వెళ్తున్నారు. గతంలో ఇక్కడ వైద్యుడిగా ఉండి సేవలందించిన వెస్లీ ప్రస్తుతం యర్రగొండపాలెంలో ప్రైవేటు హోమియో వైద్యశాల నడుపుతున్నారు. చాలా మందికి ఇంగ్లిష్ మందులు వాడటం అనారోగ్యం పాలై కార్పొరేట్ వైద్యశాలల్లో వైద్యం పొందుతూ రూ.లక్షలు కాజేసుకుంటున్నామంటూ గ్రామాల్లోని ప్రజలు పెదవి విరిచారు. పిల్లలు, పెద్దలు సైతం హోమియో వైద్యశాలకు పరుగులు తీస్తున్నారు. సంబంధిత అధికారులు హోమియోపతి వైద్యుడిని నియమించాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న హోమియో వైద్యశాల

మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా

పెద్దదోర్నాల: మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలుశిక్ష తప్పదని ఎస్సై మహేష్ వాహనదారులను హెచ్చరించారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో మండల పరిధిలోని వాహనదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడిపితే అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధిక శాతం రోడ్డు ప్రమాదాలు వ్యక్తిగత తప్పిదాలతో జరుగుతున్నాయని, దీంతో ఏ తప్పూ చేయని ఎదుటి వ్యక్తులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అతివేగం, నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరిగి ఎన్నో కుటుంబాల్లో విషాదాలు నెలకొంటున్నాయన్నారు. ప్రైవేట్ వాహనదారులందరూ తప్పనిసరిగా లైసెన్స్‌లతో పాటు యూనిఫాం కలిగి ఉండాలన్నారు. యజమానులు డ్రైవర్ల లైసెన్స్‌లు పరిశీలించి వారికి వాహనాలను ఇవ్వాలని కోరారు. సెల్‌ఫోన్‌లు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడపటం నేరమన్నారు. అలా పోలీసులకు పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఆటో, ట్రాక్టర్, జీప్ తదితర వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై మహేష్

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మార్కాపురం టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం సాయిబాలాజీ స్కూల్లో ఇంట్రామ్యూరల్స్ గేమ్స్‌ను పాఠశాల డైరెక్టర్ ప్రకాష్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గేమ్స్ అండ్ స్పోర్ట్స్ విద్యార్థి దశలో ప్రతి ఒక్కరికీ చాలా అవసరమన్నారు. క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని చెప్పారు. పాఠశాలలో క్రికెట్, కబడ్డీ, క్యారమ్స్, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈనెల 29న జాతీయ స్పోర్ట్స్ డే సందర్భంగా బహుమతులు అందదిస్తామని ప్రిన్సిపాల్ మస్తానవలి తెలిపారు. సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ ఆవుల వెంకటేశ్వర్లు



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

అసత్య ప్రచారాలు చేయవద్దు

ముండ్లమూరు: గ్రామాల్లో అసత్య ప్రచారాలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దర్శి సీఐ రామారావు హెచ్చరించారు. మండలంలోని పోలవరం, పసుపుగల్లు గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారి వివరాలు పోలీసులకు తెలియజేస్తే వారి సమాచారం గోప్యంగా ఉంచుతామని చెప్పారు. అలాంటి వారికి ఎవరూ భయపడొద్దని తెలిపారు. ఎలాంటి అసత్య ప్రచారాలు అయినా సోషల్ మీడియాలో పోస్ట్ చేసే యువకుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రధానంగా మహిళలకు సంబంధించిన పోస్టులు చేస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. దయచేసి ఎవరూ అలాంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా సంబంధిత శాఖ అధికారులను కలిసి పరిష్కరించుకోవాలన్నారు. పంతాలకు వెళ్లి అనవసర వివాదాలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. రాజకీయ నాయకులు విద్వేషాలు రెచ్చగొట్టే పనులు ఎవరూ చేసినా సహించేది లేదన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది యేసుబాబు, మరియబాబు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



పోలవరంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రామారావు



పొదిలిలో ఉత్సాహంగా ఉట్టి కొడుతున్న చిన్నారులు



కంభంలో కోలాటం ఆడుతున్న యువతులు

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

పొదిలి: స్థానిక దర్శి రోడ్డులోని పొదిలికొండ లక్ష్మీ నరసింహస్వామి వారి గోశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గోవులను పూజించడంతోపాటు గాయత్రి హోమం, విశేష పూజలు చేశారు. చిన్ని కృష్ణుడి వేషధారణతో పిల్లలు, చిన్నపిల్లలు వేసిన కోలాటం అలరించాయి. పశుగ్రాస దాతలకు సన్మానం జరిగింది. అనంతరం భక్తులకు అన్న దానం చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో బాల బాలికలతోపాటు యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గౌరవాధ్యక్షుడు అప్పల వెంకట సత్యనారాయణ, అధ్యక్షులు అప్పల శంకరరావు, ప్రధాన కార్యదర్శి కాకర్ల జగదీశ్వరరావు, కోశాధికారి అంగులూరి నాగరాజు, గౌరవ సలహాదారులు యాదాల వెంకట మోహనరావు, ఆకుపాటి లక్ష్మణ నాయుడు పాల్గొని కార్యక్రమాలను పర్యవేక్షించారు. వాసవీ క్లబ్, ఇంటింటి వాసవీ సేవాదళ్ భక్త బృందం, వాసవీ లెవెన్ ఫ్రెండ్స్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

■ **కొనకనమిట్ల:** మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలలో అర్చకులు కృష్ణుడికి విశేష పూజలు చేశారు. మండలంలోని గొట్లగట్టులో కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులకు గోపీకృష్ణుల వేషధారణలో సందడి చేశారు.

■ **కొమరోలు:** కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గోపాలునిపల్లెలో పురాతన వేణుగోపాలస్వామి దేవాలయంలో ధర్మకర్త శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కొమరోలులోని తాతిరెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో వెలసిన గీతా మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి నగర సంకీర్తన, శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం దేవాలయాల్లో భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేశారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు.

■ **కంభం:** హరేకృష్ణ భక్తబృందం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పట్టాభిరామస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమం, కోలాటం ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామోత్సవంలో మహిళా భక్తులు పల్లకి మోశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

■ **గిద్దలూరు రూరల్:** శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం వేడుకలను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాత సేవతో ప్రారంభించి స్వామివారి కల్యాణ మహోత్సవం, గ్రామోత్సవం, కోలాటం, భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఓ.వెంకటయ్య యాదవ్, సభ్యులు మొత్రి పిచ్చయ్యయాదవ్, బాలగురవయ్య యాదవ్, బాలయ్య, రమేష్ తదితరులు భక్తులకు అన్ని వసతులను ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ బుడతా మధుసూదనరావు, యాదవ సంఘం నాయకులు బి. బాలయ్య యాదవ్, త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో విశ్వభారతి స్కూల్ ఆవరణలో ప్రత్యేక పూజలు చేశారు.

■ **మార్కాపురం రూరల్:** పట్టణంలోని గాంధీబజారులో 43వ అంగన్‌వాడీ కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలంకరించి వేడుకలను నిర్వహించారు. చిన్నారులతో ఉట్టికొట్టించారు.

■ **తర్లుపాడు:** స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు రమణాచార్యులు, సాయి మోహన్ స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. స్వామివారి గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈఓ చెన్నకేశవరెడ్డి, ఆలయ ధర్మకర్త విజయభాస్కర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

■ **కురిచేడు:** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక శ్రీ వాసవికన్య కాపరమేశ్వరి దేవస్థానంలో వేడులను శ్రీ కృష్ణ పీఠం శాశ్వత కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు ఆలయ పూజారి నారాయణం వెంకటేశ్వర్లు కమిటీ వారితో వేద పఠనంతో ఆలయ ప్రదక్షణ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అఖండ జ్యోతి స్థాపనం, రుత్విగరణం, మండపారాధన, కలశస్థాపన, 9 గంటలకు మహిళా మండలి వారిచే గోపూజ, 10 గంటలకు సిద్ధిబుద్ధి సమేత గణపతి దేవల కళ్యాణం, రాత్రి 7 గంటలకు 10 సంవత్సరాల్లోపు పిల్లలకు శ్రీకృష్ణప్యాన్సి డ్రస్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. 7.30 గంటలకు గీతాపారాయణం, 8 గంటలకు సహస్రనామ పూజ జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

■ **దొనకొండ:** స్థానిక అడ్డ రోడ్డు ఆనంద ఆశ్రమంలో శ్రీకృష్ణ జన్మాష్టమీ వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి ఆశ్రమంలోని గోశాలలో ఏర్పాటు చేసిన శ్రీ క్రిష్ణుడిని పూలతో అలంకరించి అభిషేకాలు చేశారు. నిత్య పూజలు శ్రీక్రిష్ణ అష్టోత్తర, శ్రీ క్రిష్ణా స్తోత్రాలు, బాలక్రిష్ణ స్తోత్రం, సహస్ర నామ పూజలు, గో పూజ నిర్వహించారు. నైవేద్యాలు, ఫలాలు సమర్పించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి శ్రీక్రిష్ణ జన్మాష్టమీ వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు భైరవానంద స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు.



కొమరోలులో..



పొదిలిలో హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే, యాదవ సంఘ నాయకులు



దొనకొండలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న భక్తులు



మార్కాపురంలో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు



తర్లుపాడులో ఉట్టికొడుతున్న యువకులు



గోపూజ చేస్తున్న మహిళలు



కంభం రామాలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం..

మతిస్థిమితం లేని వ్యక్తికి వైద్యసేవలు

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు డంపింగ్ యార్డు వద్ద రెండు రోజులుగా అపస్మారక స్థితిలో ఉన్న మతిస్థిమితం లేని వ్యక్తికి పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించారు. పసుపుగల్లు గ్రామస్తులు మతిస్థిమితం లేని వ్యక్తి రెండు రోజులుగా అక్కడ పడి ఉన్నాడని పోలీసులకు సోమవారం సమాచారం ఇచ్చారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు వీఆర్ఏ ఏసుతో కలిసి అతిని వద్దకు చేరుకున్నారు. అతను అపస్మారక స్థితిలో చిరిగిన దుస్తులతో పడి ఉండటంతో హెడ్ కానిస్టేబుల్ నూతన వస్త్రాలు తెప్పించి అతని నుంచి సమాచారం తెలసుకునే ప్రయత్నం చేశారు. అతని నుంచి ఎలాంటి వివరాలు రాకపోవడంతో ప్రథమ చికిత్స అనంతరం 108లో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని పరిశీలిస్తున్న హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు

వేడుకగా ప్రతిష్ఠ మహోత్సవాలు

కొనకనమిట్ల: మండలంలోని సిద్ధవరంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మతల్లి, పోతురాజుస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. వేద పండితుడు పోతులూరి శివరామాచార్య స్వామి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కళశ స్థాపనలో ఉభయదాతలుగా గ్రామస్తులు పాల్గొన్నారు. మంగళవారం అమ్మవారికి కుంకుమ బండ్లతో ఉత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి ఉత్సవం

మండలంలోని కాట్రగుంటలో పెద్దమ్మతల్లి ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.